నమస్తే తెలంగాణ
ఖమ్మం
3 ఖమ్మం, శుక్రవారం 10 మే 2024 KHAMMAM



కూరగాయల మార్కెట్‌లో ఓటు అభ్యర్థిస్తున్న నామా నాగేశ్వరరావు

# మీతో మమేకమయ్యా.. కట్టుబడి పని చేస్తా..

- ఖమ్మం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు
- మధిరలో వాకర్స్ క్లబ్, మార్కెట్‌లో విస్తృత ప్రచారం

మధిర, మే 9 : 'ఇన్నాళ్లూ మీలో ఒకడిగా ఉంటూ మమేకమయ్యా. మీరు ఓటేసి ఆశీర్వదిస్తే మీ బాగు కోసం కట్టుబడి పని చేస్తా' అంటూ ఖమ్మం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరావు వాకర్స్‌ను కలిసి ఓట్లు అభ్యర్థించారు. గురువారం ఉదయం మధిరలో కలయిక వాకర్స్ క్లబ్, స్విమ్మర్స్ క్లబ్, కొలగాని టౌన్ షిప్‌లలో పర్యటించిన ఆయన వారిని ఆప్యాయంగా పలకరిస్తూ ఎన్నికల ప్రచారం చేశారు. తెలంగాణ తల్లి విగ్రహం వద్ద అడ్డా కార్మికులను, కూరగాయల మార్కెట్ వ్యాపారులు, కొనుగోలుదారులను ఓట్లు అభ్యర్థిస్తూ వారితో ముచ్చటించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజాసేవలో నిమగ్నమయ్యానని తెలిపారు. తన తండ్రి నామా ముత్తయ్య ట్రస్టు పేర ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టానని గుర్తు చేశారు. ఎంపీగా పార్లమెంట్ సమావేశాల్లో ఎన్నో సమస్యలను లేవనెత్తి వాటి పరిష్కారానికి కృషి చేశానన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో మళ్లీ గెలిపిస్తే అపరిష్కృత సమస్యలకు పరిష్కారం చూపుతానన్నారు. ఇప్పటికే రెండుసార్లు గెలిచి పార్లమెంట్ నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి చేశానని, మళ్లీ గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రంగిశెట్టి కోటేశ్వరరావు, చిత్తారు నాగేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు మొండితోక జయాకర్, పార్టీ మండల అధ్యక్షుడు రావూరి శ్రీనివాసరావు, పల్లపోతుల వెంకటేశ్వరరావు, అరిగె శ్రీనివాసరావు, కృష్ణప్రసాద్, భాస్కర్‌రెడ్డి, యన్నంశెట్టి అప్పారావు, కలయిక వాకర్స్ క్లబ్ సభ్యులు బాలకోటేశ్వరరావు, యార్లగడ్డ నరసింహారావు, స్విమ్మర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## కాంగ్రెసోళ్ల మాటలు నమ్మొద్దు

**అభివృద్ధి కోసం పాటుపడే నామాను గెలిపించాలి**

**పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి**



ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న కందాల ఉపేందర్‌రెడ్డి

కూసుమంచి(నేలకొండపల్లి), మే 9 : ఇచ్చిన హామీలను గాలికొదిలేసిన కాంగ్రెసోళ్లు పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ల కోసం మళ్లీ వస్తున్నారని, వాళ్ల మాటలు నమ్మొద్దని, నిరంతరం అభివృద్ధి గురించి పాటుపడే బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావుకు ఓటు వేసి గెలిపించాలని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అన్నారు. నేలకొండపల్లి మండలం భైరవునిపల్లి, రాజేశ్వరపురం గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ కందాల గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పింఛన్లు రూ.4 వేలు ఇస్తామన్నారు.. ఇచ్చారా? రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామన్నారు.. చేశారా? కల్యాణలక్ష్మికి తులం బంగారం ఇస్తామన్నారు.. ఇచ్చారా? అంటూ కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వం అన్ని రంగాలకు పెద్దపీట వేసిందని, ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందాయని, అవన్నీ కొనసాగాలంటే కారు గుర్తుకు ఓటు వేసి నామాను గెలిపించాలని కోరారు. నామా గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్ పర్సన్ మరికంటి ధనలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, నాయకులు హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మోసాలను వివరించాలి

**నామా రోడ్ షోను జయప్రదం చేయండి**

**కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య**



కల్లూరులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి, మే 9 : అమలుకాని హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరు గురించి ఓటర్లకు అర్థమయ్యే విధంగా వివరించాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ గురువారం సండ్ర కల్లూరు మండలంలో విస్తృతంగా పర్యటించారు. కల్లూరులోని బొప్పన రామారావు ఇంటి వద్ద కల్లూరు, రాళ్లబంజర్, పాయపూర్, నారాయణపురం, కొర్లగూడెం, పుల్లయ్యబంజర్, హనుమాతండా, చిన్నకోరుకొండి గ్రామాల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు నామా నాగేశ్వరరావు రోడ్ షో కల్లూరు పట్టణంలో జరగనున్నదని, దీనికి మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. బూత్‌ల వారీగా విస్తృతంగా ప్రచారం చేసి.. ప్రతి ఒక్కరినీ కలిసి ఓట్లను అభ్యర్థించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలెపు రామారావు, ఎంపీపీ బీరవల్లి రఘు, జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, లక్కినేని రఘు, కాటంనేని వెంకటేశ్వరరావు, పెడకంటి రామకృష్ణ, కాటేపల్లి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఖానాపురం హవేలీ రోడ్‌షోలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు. చిత్రంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

# ఐదు నెలల్లోనే అనేక ఇబ్బందులు

- పాలనలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం
- అభివృద్ధి కోసం బీఆర్ఎస్ అభ్యర్థి నామాను గెలిపించుకోవాలి
- రోడ్ షోలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- జిల్లా సమస్యలపై కేంద్రాన్ని నిలదీస్తా.. : బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా



మంచుకొండ రోడ్ షోకు హాజరైన జనం

రఘునాథపాలెం, మే 9 : కాంగ్రెస్ ఐదు నెలల పాలనలో ప్రజలు, రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రజలకు తాగునీరు అందక, రైతులకు సాగునీరు, కరెంటు లేక నానా అవస్థలు పడుతున్నారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. అబద్ధపు హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని చేజిక్కించుకున్నదని, లోక్‌సభ ఎన్నికల్లో మరోసారి మోసపోయి.. గోస పడొద్దన్నారు. ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ గురువారం ఉదయం చింతగుర్తి, చిమ్మపూడి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సాయంత్రం బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రలతో కలిసి ఖానాపురం హవేలీలో రోడ్ షో, నగర ప్రజలతో మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడారు. సీఎం మాటలు కోటలు దాటుతున్నాయి.. కానీ.. ఆచరణలో మాత్రం శూన్యంగా కనిపిస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో పూర్తిగా విఫలమైందని, రాష్ట్రంలోని ప్రతి ఒక్కరినోటా ఇదే మాట వినిపిస్తోందన్నారు. పదేళ్లు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రత్యేక విజన్‌తో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లారన్నారు. ఈ ఐదు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఐదేళ్లు వెనక్కి తీసుకెళ్లిందన్నారు. ఖమ్మం జిల్లా ప్రజలు చైతన్యవంతులని, ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు గెలిపించుకోవాలని కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో 17 స్థానాలను బీఆర్ఎస్ పార్టీ గెలుచుకొని పార్టీ సత్తా నిరూపించుకుంటుందన్నారు.

### జిల్లా సమస్యలపై నిలదీస్తా.. : బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా

తనను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే పార్లమెంట్‌లో జిల్లా సమస్యలపై గళం వినిపిస్తానని నామా నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అలవికాని హామీలతో రాష్ట్ర ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లాతో సంబంధం లేని వ్యక్తిని ఎంపీ అభ్యర్థిగా తీసుకొచ్చి పోటీలో ఉంచిందన్నారు. దీనిని విజ్ఞులైన ఓటర్లు గుర్తించి కారు గుర్తుకే ఓటేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుత్తా రవి, గొర్రె శ్రీనివాసరావు, మెంటెం రామారావు, తాతా వెంకటేశ్వర్లు, దొంతు సత్యనారాయణ, గుండ్ల ముత్తయ్య, బచ్చు విజయ్‌కుమార్, పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్లు నాగండ్ల కోటి, దండా జ్యోతిరెడ్డి, కూరాకుల వలరాజు, నాయకులు కొణకంచి వరప్రసాద్, మద్దినేని వెంకటరమణ, అజ్మీరా వీరూనాయక్, పిన్ని కోటేశ్వరరావు, చిలుమూరి కోటి, హెచ్.ప్రసాద్, ఎండీ ఫయాజ్, చిలుకోటి వెంకట సుబ్బారావు, కొట్టే నాగేంద్రబాబు, మేడబోయిన ఉపేందర్, కొట్నాల ఉపేంద్రాచారి, పెద్ద మల్లేశం, కే రాజు, షేక్ మదార్, తోట సుధాకర్, బైరెడ్డి సత్యనారాయణరెడ్డి, తూటిపల్లి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# 13 సీట్లు గెలవబోతున్నాం..

- ఖమ్మం, మహబూబాబాద్ స్థానాల్లో గులాబీ జెండా ఎగరేస్తాం
- కేసీఆర్ బస్సుయాత్ర, రోడ్‌షోలతో ప్రజల్లో నూతనోత్సాహం
- కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ ఇవ్వదని ప్రజలు కూడా గమనించారు
- స్థానికులను ఆదరించాలి.. బయట వ్యక్తులకు ఓటు వేయొద్దు..
- ఎంపీగా 'నామా' కృషితో జిల్లా ఎంతో అభివృద్ధి చెందింది
- విలేకరుల సమావేశంలో వద్దిరాజు రవిచంద్ర, తాతా మధు



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు

ఖమ్మం, మే 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): తెలంగాణలో బీఆర్ఎస్ 13 సీట్లను గెలవబోతుందని ఆ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఆ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు పేర్కొన్నారు. ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాల్లో గులాబీ జెండా ఎగరేయబోతున్నామని స్పష్టం చేశారు. ఖమ్మంలో పార్టీ అభ్యర్థి నామా నాగేశ్వరరావును, మహబూబాబాద్‌లో పార్టీ అభ్యర్థి మాలోత్ కవితను గెలిపించేందుకు ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారని అన్నారు. బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా కార్యాలయమైన నగరంలోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధుతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కేసీఆర్ అవసరాన్ని, బీఆర్ఎస్ ఆవశ్యకతను ప్రజలు గుర్తుచేసుకుంటున్నారని అన్నారు. కేసీఆర్‌ను గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటామంటూ ఆయా సభల్లో ప్రజలు అంటుండడమే ఇందుకు కారణమని అన్నారు. అలాగే, తెలంగాణ వ్యాప్తంగా కేసీఆర్ బస్సుయాత్రకు, రోడ్ షోలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని అన్నారు. అన్ని చోట్లా ఆయనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, నీరాజనం పలుకుతున్నారని వివరించారు. కేసీఆర్ పాలనను కోల్పోయామన్న భావన ప్రజల్లో స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎన్నడూ కష్టాలపాలు కాని తాము.. కాంగ్రెస్ 150 రోజుల పాలనలోనే అనేక కష్టాలను చూస్తున్నామని ప్రజలు అంటున్నారని వివరించారు. రైతుబంధు ఇవ్వలేదని, పింఛన్లు పెంచలేదని, కల్యాణలక్ష్మి మంజూరు చేయలేదని, దాంతోపాటు ఇస్తామన్న తులం బంగారం మాటే మర్చిపోయారని చెబుతూ ప్రజలే ఆ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని అన్నారు. చివరికి కరెంట్ రాకుండా, నీళ్లు లేకుండా చేసిందని అంటున్నారని అన్నారు. 'ఇక కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ ఇవ్వదు. ఏమీ చేయదు..' అనే నిర్ణయానికి ప్రజలు వచ్చారని అన్నారు. ప్రచారానికి ఇక రెండు రోజుల సమయం మాత్రమే ఉన్నందున శ్రేణులు ప్రజల వద్దకు వెళ్లి మరింత అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. పోలింగ్ సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### 'నామా'తోనే జిల్లా అభివృద్ధి: తాతా మధు

ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు మాట్లాడుతూ.. ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి జిల్లా అభివృద్ధి కోసం ఏం చేశారో, జిల్లా అభివృద్ధిలో ఆయన పాత్ర ఏమైనా ఉందేమో చెప్పాలని డిమాండ్ చేశారు. సొంతూరైన చేగొమ్మకు గానీ, పాలేరు నియోజకవర్గానికి గానీ ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు పాత్ర ఖమ్మం జిల్లా అభివృద్ధిలో ఎంతో ఉందని స్పష్టం చేశారు. ఎంపీగా ఆయన అనేక అభివృద్ధి పనులు చేపట్టారని వివరించారు. మరో ఎంపీ వద్దిరాజు కూడా జిల్లాలో గ్రానైట్ పరిశ్రమల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని అన్నారు. బయట వ్యక్తులకు ఓటేస్తే ఉపయోగమేమీ లేదని స్పష్టం చేశారు. పార్లమెంటులో తెలంగాణ వాణిని వినిపించే 'నామా'ను గెలిపించాలని కోరారు.

# కాంగ్రెస్‌వి గ్యారెంటీ లేని హామీలు

- ఇల్లెందు రోడ్ షోలో మహబూబాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత
- ఆళ్లపల్లి, గుండాలలో ముఖ్య కార్యకర్తల సమావేశం



ఇల్లెందు రోడ్ షోలో మాట్లాడుతున్న మాలోతు కవిత

ఇల్లెందు, మే 9 : మొన్నటి శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు గ్యారెంటీ లేదని మహబూబాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో నిర్వహించిన రోడ్ షోలో ఆమె మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేందుకు కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలిచ్చి మోసం చేసిన విషయాన్ని ఇప్పుడు రాష్ట్ర ప్రజలు గ్రహిస్తున్నారని తెలిపారు. పదేళ్లు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి ఏమీ చేయకుండా ఇప్పుడు దేవుళ్ల పేరుతో ఓట్లు అడుగుతోందన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బయటకు వచ్చి గర్జించిన తర్వాతే రేవంత్ రైతుబంధు ఇస్తున్నారన్నారు. ఇల్లెందు నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమానికి గత కేసీఆర్ ప్రభుత్వం సుమారు రూ.3 వేల కోట్లు ఇచ్చిందని గుర్తు చేశారు. పదేళ్ల ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థినైన తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, నాయకులు దిండిగాల రాజేందర్, జేకే శ్రీను, సిలివేరు సత్యనారాయణ, పరుచూరి వెంకటేశ్వర్లు, శీలం రమేశ్, గిన్నారపు రాజేశ్, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

### గెలిపిస్తే ప్రజల గొంతుకనవుతా.. మీ సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తా..

ఆళ్లపల్లి/గుండాల, మే 9 : కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపిస్తే ప్రజల గొంతుకను పార్లమెంట్‌లో వినిపిస్తానని మహబూబాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత అన్నారు. గురువారం ఆళ్లపల్లి మండలం మర్కోడు పంచాయతీ పరిధిలోని పెద్దూరు గ్రామంలో జడ్పీటీసీ కొమురం హనుమంతరావు నివాసంలో, గుండాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ బూటకపు గ్యారెంటీతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. మాట తప్పిన కాంగ్రెస్ నాయకుల విధానాలపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించి నిలదీయాలన్నారు. కాంగ్రెస్ పాలనలో కరెంటు కష్టాలు మళ్లీ వచ్చాయని, రైతాంగం పంటలు పండించుకోవడానికి ఇబ్బందులు పడుతోందన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపిస్తే ఏజెన్సీ ప్రాంత ప్రజల సమస్యలను పార్లమెంట్‌లో చర్చించి పరిష్కారమయ్యేలా చూస్తానన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందాలంటే ఈ నెల 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ కొండ్రు మంజుభార్గవి, ఆళ్లపల్లి బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పాయం నరసింహారావు, షేక్ బాబా, నాయకులు రాంబాబు, వెంకటేశ్, సతీశ్, సత్యం, రవి, సమ్మయ్య, భవాని శంకర్, వట్టం రాంబాబు, గుండాల బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు తెల్లం భాస్కర్, రవీందర్‌రెడ్డి, రామ్మూర్తి, శ్రీనివాస్, గుండ్ల రంజిత్, టి.రాము, అటికం నాగేశ్వరరావు, పొంబోయిన సుధాకర్, గొగ్గెల రాంబాబు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏడాదిలో అయోధ్యలా భద్రాద్రి: మంత్రి తుమ్మల



రంగనాయకుల గుట్టపై నుంచి టెంపుల్ వ్యూను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

భద్రాచలం, మే 9 : దేశవ్యాప్తంగా అయోధ్య పేరు ఎలా వినిపించిందో.. మరో ఏడాదిలో భద్రాచలం రామాలయం పేరు అలాగే వినిపిస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం భద్రాచలంలో పర్యటించిన ఆయన రంగనాయకుల గుట్టపై ఉన్న వెంకట్ నిలయం నుంచి రామాలయాన్ని, పట్టణ వ్యూను తిలకించారు. ఈ సందర్భంగా రామాలయ అధికారులతో ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం ఎన్ని ఇళ్లు తొలగించాల్సి వస్తుందో దానిపై వీలైనంత త్వరగా తనకు నివేదిక అందించాలన్నారు. మా ప్రభుత్వ హయాంలోనే రామాలయాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. మిథిలా ప్రాంగణంలోని స్టేడియం వద్ద సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేస్తే విద్యుత్ ఆదా అవుతుందన్నారు. సోలార్ ప్యానళ్లు అమర్చేందుకు చర్యలు చేపట్టాలని ఆలయ అధికారులకు సూచించారు. మంత్రి వెంట ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, సీనియర్ నాయకులు ఎస్కే రసూల్, యశోద రాంబాబు, తోటకూర రవిశంకర్ ఉన్నారు.

## నేడు 'స్వీప్' బైక్ ర్యాలీ: కలెక్టర్


మామిళ్లగూడెం, మే 9: స్వీప్ కార్యాచరణలో భాగంగా శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ప్రభుత్వ అధికారులు, సిబ్బందితో ఖమ్మంలో బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు ప్రాముఖ్యతను తెలుపుతూ, ఓటు హక్కు వినియోగంపై అవగాహన పెంచుతూ ఈ ర్యాలీని నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు నూతన కలెక్టరేట్ వద్ద ప్రారంభమయ్యే ఈ ర్యాలీ.. శ్రీశ్రీ సర్కిల్, జడ్పీ సెంటర్ మీదుగా పెవిలియన్ గ్రౌండ్ వరకు చేరుకుంటుందని వివరించారు. ఐడీవోసీ అధికారులు, సిబ్బంది హెల్మెట్ ధరించి తప్పనిసరిగా ఈ ర్యాలీలో పాల్గొనాలని సూచించారు.

# రైతుబంధుకు కోత పెడితే.. కాంగ్రెస్‌కు వాతే..

- పంటలు చేతికొచ్చాక పెట్టుబడి సాయం ఇస్తే ఏం చేసుకోవాలి?
- విత్తనాలు ఉద్దెరకెవరిస్తరు? పై మందుకు పైసలెవలిస్తరు?
- సీఎం, మంత్రుల 'రైతుబంధు' రూల్స్‌పై అన్నదాతల ఆగ్రహం

పంటల సాగుకు అక్కరకొచ్చే రైతుబంధు సాయాన్ని సకాలంలో కాకుండా.. సీజన్ ముగిశాక ఇస్తే తామేం చేసుకోవాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. పంటలు చేతికొచ్చాక పెట్టుబడిని అందిస్తే ప్రయోజనమేముంటుందని ప్రశ్నలు సంధిస్తున్నారు. అప్పటికే పంటలమ్మిన నగదు తమ చేతికొచ్చాక రైతుబంధు ఇస్తే ఎలా ఉపయోగించుకోవాలని అడుగుతున్నారు. రైతుబంధుకు పరిమితులు విధిస్తామని, కోతలు పూర్తయ్యాక సాయం అందిస్తామని, ఐదెకరాల లోపు వారికే పంటల పెట్టుబడి సాయాన్ని జమ చేస్తామని కొంతకాలంగా ముఖ్యమంత్రి, పలువురు మంత్రులు ఆయా సభల్లో చేస్తున్న ప్రకటన పట్ల అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీజన్‌కు ముందు సాయం అందించకపోతే విత్తనాలు ఉద్దెరకెవరిస్తరని, పై మందుకు పైసలెవలిస్తరని ప్రశ్నిస్తున్నారు. రైతుబంధుకు కోత పెడితే కాంగ్రెస్ సర్కారు వాత తప్పదని హెచ్చరిస్తున్నారు. రైతుబంధు విషయంలో రైతులను ఇబ్బంది పెట్టే రూల్స్ ఉంటే సహించబోమని స్పష్టం చేస్తున్నారు. ఆయా ప్రశ్నలు, అభిప్రాయాలు వారి మాటల్లోనే..


### రైతుబంధు ఆలస్యమైతే ఇబ్బందులే..



రైతుబంధు సాయాన్ని సీజన్ సమయంలో కాకుండా ఆ తరువాత ఇస్తే మాలాంటి రైతులం ఇబ్బందులు పడతాం. ఇప్పటి వరకూ కచ్చితంగా సీజన్‌కు ముందే అందిన రైతుబంధు సాయం ఇటీవలి యాసంగిలో సమయానికి అందలేదు. దీంతో అప్పుల కోసం పరుగులు పెట్టాం. అవి కూడా సకాలంలో అందకపోవడంతో ఎన్నో ఇబ్బందులు పడ్డాం. పంటల సాగు కూడా కొంత ఆలస్యమైంది. ఇకముందు కూడా రైతుబంధు సాయాన్ని సకాలంలోనే అందించాలి. అప్పుడు సాగు సక్రమంగా, సమృద్ధిగా ఉంటుంది. లేకుంటే అన్నదాతల పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుంది.

**–వెలివెల కృష్ణ, రైతు, పెనుబల్లి**

### విత్తనాల సమయంలోనే రైతుబంధు ఇవ్వాలి



గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చినట్లుగా సీజన్‌కు ముందే రైతులందరికీ రైతుబంధు సాయం అందజేయాలి. సాగు పనులు మొదలుపెట్టే ముందు ఇస్తే వాటితో మొదట విత్తనాలు కొనుక్కుంటాం. మిగిలిన నగదును తరువాత పురుగుమందులకు, ఎరువులకు వినియోగించుకుంటాం. ఇప్పటిదాకా కేసీఆర్ ప్రభుత్వం ఇలాగే ఇచ్చింది. దీంతో పంటల సాగుకు ఇబ్బందులు రాలేదు. కానీ ఇకముందు అలా ఇవ్వబోమని, పంటలు చేతికొచ్చాకే రైతుబంధు ఇస్తామని మంత్రులు అంటున్నారు. అది కూడా కొందరు రైతులకు మాత్రమే ఇస్తామంటున్నారు. రైతులకు అందించే పంటల సాయం విషయంలో ప్రభుత్వం ఇబ్బందులు పెట్టొద్దు. కొందరికే రైతుబంధు' అనే మంత్రుల మాటలు సరికాదు. ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలకు అనుగుణంగా రైతులందరికీ పథకాన్ని వర్తింపజేయాలి.

**–భూపతి రమేశ్, రైతు, రావికంపాడు, చంద్రుగొండ**